

**105**

**ధారావాహిక**

# జాయ సేనాపతి


మత్తి భానుమూర్తి ...
99893 71284


## చారిత్రక కాల్పనిక నవల

**జరిగిన కథ :** రేపు యుద్ధం ప్రారంభం అనగా.. ముందురోజు సంధ్యవేళ రెండు రాజ్యాల యుద్ధముఖ్యులను స్కంధావారంలోని తన గోల్లెనకు ఆహ్వానించాడు జాయపుడు. మూడు రాజ్యాల వీరులంతా కూసెనపూండి కళాక్షేత్ర కళాకారుల ప్రదర్శనలను తిలకించాల్సిందిగా కోరాడు. యుద్ధ ఉద్రిక్త, ఉద్వేగాల నడుమ ఈ కళాప్రదర్శనలు ఏమిటో ఎవ్వరికీ అంతుపట్టలేదు. అయినా, కళాప్రదర్శన అంటే అర్ధంపర్థంలేని పిచ్చి ఉన్న వాళ్లంతా.. ఆ ప్రదర్శనకు తరలివచ్చారు. యుద్ధక్షేత్రంలోనే నిర్మించిన రంగస్థలంపై ఒకే ఒక్క నటుడు ప్రత్యక్షమయ్యాడు. తొలుత ఓ శైవభక్తుడిగా అభినయం ప్రారంభించి తరవాత వైష్ణవభక్తుడిగా మారాడు. ముగింపులో హరిహరుడిగా ప్రత్యక్షమయ్యాడు.

అదికూడా శివుడు, విష్ణుమూర్తి.. తర్వాత ఆ ఇద్దరి సమ్మేళనంగా హరిహరుని కథ. ఆరోజుకు ప్రదర్శనలు పూర్తయినట్లు యవనిక రంగస్థలాన్ని మూసేసింది.

చూసిన రాజులు, యుద్ధముఖ్యులు ఆ కళలలోకం నుంచి బయట పడటానికి చాలాసమయం పట్టింది.

''ఈరోజు ఇక్కడే అందరం కలిసి భోజనాలు చేద్దాం. అందరికీ వెలనాడు వారి ప్రత్యేక విందు..'' జాయచోడుని ప్రకటన. భోజనాలవద్ద శత్రు, మిత్రులు లేరు. అందరూ ప్రదర్శనలు కలిగించిన ఆలోచనలతో గందరగోళమై మౌనంగా భోజనాలు కానిచ్చారు. తింటూ ఉండగానే తోలుబొమ్మలాట మొదలయ్యింది.

'రండి రండి..' అంటూ వెలనాడు కళాసేవకుల బృందం అందరినీ వినయంగా పిలుస్తున్నారు. బొమ్మలాట మొదలయ్యేసరికి అందరూ ఎంగిలి చేతులు కడిగి వేగంగా అక్కడికి పరుగులుపెట్టారు. తోలుబొమ్మలాట అంటే రాజుకైనా బంటుకైనా.. యుద్ధం కంటే మక్కువ ఎక్కువ.

అదికూడా శైవ అంశాలతో మొదలెట్టి వైష్ణవ అంశాలను చర్చించి.. ఆనక హరిహరదేవుని గురించి వివరించి ముగిసింది. అందరూ కారుతున్న చొంగ తుడుచుకుంటూ లేచారో లేదో.. జాయచోడుడు నవ్వుతూ చెప్పాడు. ''అందరూ మీమీ గొల్లెనలకు వెళ్లి విశ్రాంతి తీసుకోండి. రాత్రి కాగడాల వెలుగులో మరో అద్భుతమైన నాట్య ప్రదర్శన!''.

ఈ కళా తతంగం యుద్ధరంగంలో ఏర్పాటు చేయడంపై అందరికంటే ఎక్కువగా ఆశ్చర్యపోయింది పృథ్వీశ్వరుడు, జాపిలిసిద్ధి, వెలనాడు సేనానులు, మంత్రులు.

వారిని తన గొల్లెనలో కూర్చోబెట్టుకుని చెప్పాడు జాయచోడుడు.

''నేను ఓ ప్రయోగం చేస్తున్నాను. యుద్ధంవల్ల వాళ్లలో మార్పురాదని జాపిలిసిద్ధి కూడా మొదటే అన్నాడు. అందుకే నేను సంప్రదాయ యుద్ధం పక్కన పెట్టి.. కళాయుద్ధం చేస్తున్నాను. మతోన్మాదానికి విరుగుడుగా కళాసైన్యంతో యుద్ధ సంసిద్ధుడనయ్యాను!''.

అందరూ అయోమయంగా ఉండగా ముందు తేరుకున్న జాపిలిసిద్ధి అడిగాడు.

''నీ ఆలోచనను అర్థం చేసుకోవడానికి మేము మరొక జన్మఎత్తాలి. సరే.. మరైతే నన్నెందుకు పిలిచినట్లు? సైన్యాన్ని ఎందుకు సిద్ధం చేసినట్లు??''.

''నా ప్రయత్నంమీద నాకు నమ్మకం ఉంది. కానీ, మతోన్మాదం మీద నమ్మకంలేదు మిత్రమా! అది విషం కన్నా శక్తివంతమైనది. ఒకవేళ నా ప్రయత్నంలో నేను ఓడిపోతే.. సాంప్రదాయ యుద్ధం తప్పదు కదా!